# సం'కుల' సమరం

కూడూ గుడ్డా నీడా మనిషికి మౌలికావసరాలు. ఎలాగో అలాగ కష్టపడి కూడూ గుడ్డా సంపాదించుకున్నా, ఇప్పటి పరిస్థితుల్లో ముఖ్యంగా పట్టణాల్లో నగరాల్లో గూడు సంపాదించుకోడం చాలా కష్టమయిన పని.

స్వంత కొంప సరేసరి. సగటు మనిషి దాని గురించిన కలలు కూడా కనలేడు. తనకూ తన భార్యాబిడ్డలకూ సరిపడా అద్దె ఇల్లు దొరకబుచ్చుకోడం అన్నది ఓ ప్రహసనం. అందునా తరచూ బదిలీల పాలబడే బాధితుల మాట చెప్పనలవికాదు.

అద్దె కొంపల్లో ఒకటుంటే మరోటుండదు.

ఇంటి యజమాని విధించే రకరకాల షరతులు యింకో పక్క. పిల్లలు హైస్కూళ్ల స్థాయీవారైతే సరి. కాకపోతే! మరీ చిన్నపిల్లలున్నవాళ్ల బాధ వర్ణనాతీతం. ఇంటికి అతి దగ్గరల్లోనే బడి వుండాలి. వీటన్నింటిని మించిన నిఖార్సైన కష్టం మంచినీళ్లు.

వీటన్నింటికన్నా అతి భయంకరమైనదీ దారుణమైందీ యింకోటుంది.

* * *

మొన్న మద్దూరునగర్‌లో పాత్రికేయ మిత్రుడు సలీంబాషా కలిసాడు. మామూలు పలకరింపుల తర్వాత చెప్పాడు.

"ఇంటికోసం వెదుకుతున్నా... నా బడ్జెట్‌కి సరిపడా ఇల్లు దొరికితే, అది నా కోరికలకు అనుగుణంగా వుండదు. ఒకవేళ అట్లా నాకు అనుగుణంగా వున్న ఇల్లు దొరికితే నా బడ్జెట్ అందుకు సహకరించదు" అని గట్టిగా నవ్వాడు.

దాన్నే మధ్యతరగతి హాసం అంటారు.

దాని వెనక వున్న జీవన పోరాటం జటిలమైంది.

సరే పక్కన కదా అని "రండి ఇంటికెళ్దాం కాస్సేపు మాట్లాడుకోవచ్చు" అని ఆహ్వానించా. వచ్చి నా గదిలో కూచుని తలపైకెత్తి పైకప్పుగా వున్న సిమెంటు రేకుల్ని చూస్తూ...

"మీలాగా యిట్లా రేకుల కిందైనా సరే మనశ్శాంతితో గడిపే రోజుల కోసం చూస్తున్నా" అన్నాడు. అంటూ అతని అద్దె ఇళ్ల వేట ప్రహసనం చెప్పుకొచ్చాడు.

"మనం ఏ కాలంలో బతుకుతున్నామో తెలియడంలేదు సార్. ఒకవైపు కుల నిర్మూలన అంటూ గొప్పగొప్ప అభ్యుదయవాదులు సంఘాలు కట్టి, కులాలూ మతాలూ నాశనమైపోవాలని ఊరేగింపులూ ధర్నాలూ నిరాహారదీక్షలూ చేస్తూనే వున్నారు. మరోవేపు ఫలానా కులాన్ని ఫలానా షెడ్యూల్లోకి చేర్చాలని గొడవలు జరుగుతున్నాయి. ఈ వైరుధ్యాన్ని భరించేదెలా?" అంటూ బాధపడ్డాడు.

అద్దె ఇళ్లకూ ఆయన పైన వాక్రుచ్చిన వాక్యానికి సంబంధం ఏమిటీ అని నేనాలోచిస్తుండగానే...

"ఇల్లు అద్దెకు తీసుకోవాలంటే కులమూ మతమూ అన్న అంశాలు ఇంటి యజమానికి మనం సమర్పించుకునే వినతి పత్రంలో దాఖలు చేయాలి. చూడండిఎంత బాధాకరమో" అన్నాడాయన బాధగా.

"అబ్బే ఈ రోజుల్లో కూడా, అదీ మన కర్నూలులాంటి కార్పొరేషన్లలో అవన్నీ ఎవరు చూస్తారు, ఎవరు పట్టించుకుంటారు సలీంగారూ..." అన్నా నేను కొట్టివేస్తున్నట్టు. "మీకు టైం వుంటే నాతో వస్తారా ఓ పది నిముషాలు" అడిగాడాయన. 'పదండి' అని ఆయన స్కూటర్మీద బయల్దేరాం. ఆయన తన స్కూటర్ని తిన్నగా కృష్ణానగర్లో ఓ ఇంటి ముందుకు తీసుకెళ్లి ఆపాడు. ఆ ఇంటి గ్రిల్లుకు 'టులెట్' అన్న బోర్డు కనిపించింది.'రండి' అంటూ ఆ బోర్డు దగ్గరికి నన్ను దాదాపు లాక్కెళ్లాడు సలీం. ఆ బోర్డు మీద 'టులెట్' అని ఇంగ్లీషులో పెద్దగా రాసి వుంది. కింద చిన్న తెలుగక్షరాల్లో 'బ్రాహ్మణులకూ వైశ్యులకూ మాత్రమే' అనుంది. సిగ్గుతో తల దించుకున్నా. "ఇది హిందువుల్లోని కొన్ని వర్గాలను అవమానించడమే కాదు సార్... ఇంకో ఇంటికెళ్తే 'మీరు సాయిబులు మీకద్దెకివ్వము' అని నిష్కర్షగా చెప్పారు. ఇంతా చేస్తే ఆ ఇంటి ఓనరు వైశ్యులూ కాదు బ్రాహ్మడూ కాదు. ఎక్కడి సంస్కృతి సార్ ఇదీ?" నిర్వేదంగా అడిగాడు సలీం బాషా.

నిజమే ఇంటి పునాది తవ్వే వాడిదే జాతి? ఇటుకలు చేసేవాడిదే జాతి? గోడ కట్టేవాడిది ఏ జాతి... ఆ ఇంటి మురుగు శుభ్రం చేసేవాడిదే జాతి? మనం ఒకడుగు ముందుకు వేస్తూ మూడడుగులు వెనక్కి వేస్తున్నాం కాదంటారా?

"జాతులందు మిగులు జాతియేదెక్కుడో
యెరుగలేక తిరుగనేమి ఫలము
యెరుక కలవాడె హెచ్చైన కులజుడు (మనుజుడు)"

అన్న వేమన్నగారూ! మీరు మళ్లీ రావాల్సిందే అంటే ఏమంటారు? వస్తారా? ఒకవేళ ఆయన వస్తానన్నా వచ్చేప్పుడు కులధ్రువీకరణ పత్రంతో రావాలేమో! ●